రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త




భారీ వర్షాలు కురవాలని వెంకమ్మగూడ మల్లికార్జున స్వామికి అభిషేకం చేయడానికి వచ్చిన గ్రామస్తులు

# వెంకమ్మగూడలో శివయ్యకు జలాభిషేకం

**నందిగామ, జులై 20, ప్రభాతవార్త :** మట్టిని నమ్మిన చేతులు మావి. కాయ కష్టం చేసి భూమి ని నమ్మి బ్రతికే కర్షకులం. ఎన్నో వ్యయ ప్రయా సాల కోర్చి భూములను సాగు చేసుకున్నాం. సకా లంలో వర్షాలు పడక.. పంటచేలు ఎండి పోతున్నాయి. చెరువులు నిండక, కుంటలు నిండక సాగునీరు తాగునీరు కరువై గొంతు తడుపుదామన్న మంచినీళ్లు దొరక్క మానవ, జంతు, పశుపక్షాదులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

వరుణ దేవా కరుణించి వర్షాలు కురిపించమని ఉమ్మడి చేగూరు, వెంకమ్మగూడ గ్రామస్తులు సోమవారం వెంకమ్మగూడ సర్పంచ్ గొర్లపల్లి అశోక్ ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున స్వామికి జలాభిషేకం చేసి పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్డే యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ నేత ధరూర్ సతీష్ పటేల్, పూజారి వీరేశం పంతులు,వార్డు సభ్యులు స్వప్న విజయ్, చిర్ర నరసింహులు, మాజీ వార్డు సభ్యులు గుండాల సాములయ్య, వడ్డే శ్రీను కుమ్మరి దేవప్ప, వెంకమ్మగూడ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు వడ్డే శ్రీను, ఉపాధ్యక్షుడు కే సాములయ్య, మరియు రాజు, వేణుగోపాల్, రాజు గణేష్, జి మల్లేష్, కే రాజు, సిద్దు, ప్రవీణ్, రాజు, టీలు, శ్రవణ్, శ్రీను మరియు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆశల చినుకులు!



ఆమనగల్లులో వర్షానికి రోడ్డుపైన నిలిచిన దృశ్యం

రాజధానిలో కురిసిన వర్షానికి జలమయమైన రోడ్డు

- ✦జిల్లాలో పలుచోట్ల తేలికపాటి జల్లులు
- ✦మురిసిపోయిన కర్షకులు
- ✦ఆరుతడి పంటలకు ప్రాణం పోసిందని హర్షం

**ఆమనగల్లు, జులై20, ప్రభాతవార్త:** ఆమనగల్లులో కళ్ళుప్పగించి చూస్తున్న నిరీక్షణల ముంగిట, ఎట్టకేలకు సోమవారం సాయంత్రం ఆశల చినుకులు రాలాయి. మధ్యాహ్నపు మబ్బులు నిశ్శబ్దంగా కమ్ముకోగా, సాయం సంధ్య వేళ.. వరుణుడు చినుకులతో మొదలై కుంభవృష్టియై కరుణించాడు. సరిగ్గా ఐదు గంటల వేళ మొదలైన జడివాన, అరగంటకు పైగా కురిసి నేలతల్లిని తడిపి ముద్దచేసింది. ఎగువ నుంచి దిగువకు పరుగులు తీసిన జలప్రవాహం వీధుల్లో ఉరకలెత్తగా, లోతట్టు ప్రాంతాలన్నీ నీటితో నిండి జలకళను సంతరించుకున్నాయి. అకాలంగా వచ్చినా, ఈ ఏటి వానలలో ఇదే కదా అతిపెద్ద వాన అని ప్రజలంతా మురిసిపోయారు. దాహంతో ఎదురుచూస్తున్న ఆరుతడి పంటల గొంతులో, ఈ వాన చినుకులు అమృతమై జీవం పోశాయి. పత్తి, జొన్న, మొక్కజొన్న చేలల్లో ప్రాణం నిలుపుతూ కాసింత మేలు చేకూర్చగా, రైతన్నల కళ్ళలో ఆనందపు వెలుగులు నిండాయి. మాడ్గుల, కడ్తాల్ మండలలో మోస్తాదు వర్షం పడింది. తలకొండపల్లి మండలంలో తెలికపాటి చినుకులు పడ్డాయి. నందిగామ మండలంలో చిరు జలులు కురిశాయి.

## ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టేద్దాం

**వర్షం నీరు వృథా కాకుండా నేలలోకి ఇంకించేందుకు ప్రణాళిక**

**రంగారెడ్డి జిల్లాలో 12,122 ఇంకుడు గుంటలకు సన్నాహాలు**

**రంగారెడ్డిఅర్బన్, జులై 20,ప్రభాతవార్త:** ఏలోన ఎఫెక్ట్ ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం అస్థిరంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలను ముమ్మరం చేసింది. భవిష్యత్తులో తలెత్తే నీటి కొరతను అధిగమించడంతో పాటు భూగర్భ జలాలను పెంపొందించేందుకు కురిసే ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నీటి సంరక్షణ పనులను యుద్ధప్రాతిపదికన అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీరు వృథాగా వాగులు, వంకలు, చెరువుల్లోకి వెళ్లిపోకుండా నేలలోకి ఇంకించే విధంగా పెద్ద ఎత్తున ఇంకుడు గుంతలు, పంట గుంటలు, ఊర గుంటలు నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ పనుల ద్వారా భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 9,474 వ్యక్తిగత ఇంకుడు గుంతలు, 1,748 పంట గుంటలు, 450 ఊరి కుంటలు, 450 కమిటీ కుంటలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ పనులన్నింటినీ అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రతి మండలానికి లక్ష్యాలను కేటాయించి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులు ముందుకు సాగనున్నారు. వ్యక్తిగత ఇంకుడు గుంతలు రైతుల వ్యవసాయ భూముల్లో, నివాస గృహాల వద్ద ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీరు నేరుగా భూమిలోకి ఇంకి బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరిగే అవకాశం ఉంటుంది. అదే విధంగా పంట కుంటలు రైతులకు అవసరమైన సమయంలో సాగునీటిని అందించడంలో కీలకంగా మారనున్నాయి. ఊట కుంటలు, కమిటీ కుంటల ద్వారా గ్రామాల్లో నీటి నిల్వ సామర్థం పెరిగి భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి అవసరాలకు ఉపయోగపడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.ఈ పనుల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీలు, ఉపాధి హామీ సిబ్బంది, సాంకేతిక సహాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి నిర్మాణాన్ని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నరు. అలాగే ప్రతి గ్రామంలో పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఏలోన ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ చర్యలను మరింత వేగవంతం చేస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ తెలిపారు.వర్షపు నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని భూగర్భ జలాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారని వెల్లడించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రతి మండలంలో పనుల పురోగతిని రోజువారీగా సమీక్షిస్తామన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అన్ని నీటి సంరక్షణ పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి కావాలని అధికారులను ఆదేశించి పనులు పూర్తి చేస్తామన్నారు. వర్షపు నీటి సంరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



నిరసన దీక్షలో పాల్గొన్న నల్సార్ విద్యార్థులు

# శామీర్‌పేటలో నీట్ సెగ

**పేపర్ లీక్‌పై నల్సార్ లా వర్సిటీలో నిరహార దీక్షలు**

**నేడు పోస్టుకార్డు ద్వారా ప్రచారం చేయాలని నిర్ణయం**

**శామీర్‌పేట, జులై 20, ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీక్, కేంద్ర విద్యాశాఖ నిర్లక్ష్యం, దేశంలో నెలకొన్న విద్యా పరిస్థితిపై ఢిల్లీలో నిర్వహించిన విద్యార్థుల నిరసనలు, ధర్నాకు మద్దతుగా శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థులు నిరసన దీక్షలు చేపట్టి సంఘీభావం తెలియజేశారు. సోమవారం శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో దేశంలో నెలకొన్న విద్యా సంబంధిత సమస్యలపై పరిస్థితిపై నేహా బోరా, మనీష్‌కుమార్, అమీన్ అమిటోజ్, సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరహార దీక్షకు సంఘీభావంగా నల్సార్ లా యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు సుమారు 100మంది సంఘీబావ నిరసనలు చేపట్టారు. విద్యార్థులు సామూహికంగ ఒక పూట బోజనం చేయకుండా

# సిఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు

**దుద్యాల్, జులై 20 ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల్ మండలం హకీంపేట్ ఇంటిగ్రెటెడ్ ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూలై 21న పరిశీలించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తో కలిసి సోమవారం పర్యటన ఏర్పాట్లను పరిశీలిం చారు. సీఎం పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెలిప్యాడ్, ఇంటిగ్రెటెడ్ ఎడ్యుకేషన్ హబ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

# గ్రామీణ విద్యకు గేమ్‌చేంజర్

## హకీంపేట్ మెగా ఎడ్యుకేషన్ హబ్..

**దుద్యాల్, జులై 20, ప్రభాతవార్త:** ఒకప్పుడు వ్యవసాయం, ఉపాధి కోసం వలసలతో గుర్తింపు పొందిన కొడంగల్ ప్రాంతం.. ఇప్పుడు విద్యా రంగంలో కొత్త శకానికి నాంది పలుకుతోంది. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలంలోని హకీంపేట్ గ్రామంలో సుమారు 248 ఎకరాల విస్తీర్ణంలో రూ.600 కోట్లతో నిర్మిస్తున్న మెగా ఎడ్యుకేషన్ హబ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఆధునిక, నాణ్యమైన విద్యను ఒకే ప్రాంగణంలో అందించాలనే లక్ష్యంతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది.

ఈ ఎడ్యుకేషన్ హబ్ పూర్తయితే కొడంగల్, దుద్యాల్, బొంరాస్ పేట్, దౌల్తాబాద్, పరిగి, కోస్గి తదితర మండలాలకు చెందిన సుమారు నాలుగు వేల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. ఆధునిక తరగతి గదులు, డిజిటల్ ల్యాబ్‌లు, హాస్టళ్లు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు వంటి అత్యాధునిక సదుపాయాలతో ఈ క్యాంపస్ రూపుదిద్దుకుంటోంది.

ఎడ్యుకేషన్ హబ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లు వెచ్చిస్తున్నారు. ఒకేసారి రెండు వేల మంది విద్యార్థులు చదివే సామర్థంతో నిర్మిస్తున్న ఈ భవనాన్ని 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని అధికారులు పనులను వేగవంతం చేశారు.

**మెడికల్, నర్సింగ్ కళాశాలలకు రూ.19 కోట్లు**

గ్రామీణ విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేసేందుకు మెడికల్, నర్సింగ్, పారామెడికల్ కళాశాలల నిర్మాణానికి ప్రాథమికంగా రూ.19 కోట్లు విడుదలయ్యాయి. ఈ భవనాలను 2027 జూన్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

**పశుసంపద అభివృద్ధికి వెటర్నరీ కళాశాల..**

వ్యవసాయ ఆధారిత గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగపడేలా రూ.200 కోట్లతో వెటర్నరీ కళాశాల నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టును 2028 ఆగస్టు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పశువైద్య విద్య, పరిశోధనలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి.

**ఉన్నత విద్యకూ ఊతం..**

ఇంజినీరింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణాలకు కూడా నిధులు విడుదలయ్యాయి. ఈ భవనాలను 2026 సెప్టెంబర్ నాటికి పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు కృషి చేస్తున్నారు. బాలికల గురుకుల పాఠశాల నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

**వచ్చే యేడాది నుంచే తరగతులు?**

ఈ మెగా ఎడ్యుకేషన్ హబ్ పూర్తయితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. విద్యతో పాటు ఉపాధి అవకాశాలు పెరగడంతో స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం కానుంది. 2027 విద్యా సంవత్సరంలో కొన్ని విద్యాసంస్థల్లో తరగతులు ప్రారంభమయ్యే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాలు

- -248 ఎకరాల్లో విద్యా నగరం
- - రూ.200 కోట్లతో అత్యాధునిక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్
- - నాలుగు వేల మంది విద్యార్థులకు ప్రయోజనం



ముమ్మరంగా పనులు కొనసాగుతున్న మెడికల్ కళాశాల భవనం



# బ్లాక్‌మెయిలింగ్ స్కెచ్ రివర్స్

- రెవెన్యూ రికార్డుల లూప్‌హోల్‌పై మాఫియా కన్ను
- 24 ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తి పేరును తెరపైకి తెచ్చి భారీ దందా
- ఒక న్యాయవాది సహకారంతో మైండ్ గేమ్
- సోషల్ మీడియాలో రెవెన్యూ అధికారులపై తప్పుడు ఆరోపణలు
- రూ. 50 లక్షలు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్
- బాధితుల ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్

**మొయినాబాద్, జులై 20, ప్రభాతవార్త :** రియల్ ఎస్టేట్ రంగంలో రికార్డుల నిరక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని, ఏకంగా 24 ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తిని తెరపైకి తెచ్చి భారీ దందాకు తెరలేపిన ముఠా గుట్టు రట్టయింది. చనిపోయిన వ్యక్తి పేరుతో తప్పుడు కథలు సృష్టించి, సోషల్ మీడియా వేదికగా రెవెన్యూ అధికారులపై డిజిటల్ దాడికి తెగబడటమే కాకుండా, భూమి యజమానిని బెదిరించి రూ. 50 లక్షలు వసూలు చేయాలని చూసిన వ్యవహారంలో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ల్యాండ్ గ్రాబింగ్, బ్లాక్‌మెయిలింగ్ ఉదంతంలో చదువ సుభాష్ అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, చదువ కృష్ణయ్య ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ వివాదానికి ప్రధాన కారణం దశాబ్దాల క్రితం నాటి రికార్డుల నిరక్ష్యమే. వివరాలలోకి వెళితే.. చిలుకూరు గ్రామానికి చెందిన చదువ గండయ్య అనే వ్యక్తి 1993, 1997 మధ్య కాలంలోనే తనకు ఉన్న 15 ఎకరాల భూమిని పూర్తిగా వేర్వేరు వ్యక్తులకు అమ్మేశారు. కొనుగోలుదారులు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నప్పటికీ, రెవెన్యూ రికార్డులలో (మ్యుటేషన్) తమ పేర్లు నమోదు చేసుకోకపోవడంతో రికార్డుల్లో పాత యజమాని గండయ్య పేరే కొనసాగుతూ వచ్చింది. కాగా, అసలు యజమాని గండయ్య 2002లోనే మరణించారు. ఆ తర్వాత, సదరు భూమిని కొనుగోలు చేసిన శ్రీనివాసరాజు అనే వ్యక్తి చట్టపరంగా కోర్టును ఆశ్రయించి, న్యాయస్థానం ఆదేశాల మేరకే రెండు నెలల క్రితం రెవెన్యూ రికార్డులలో తన పేరును అధికారికంగా నమోదు చేయించుకున్నారు. అయితే, రికార్డుల్లో ఉన్న పాత లూప్‌హోల్‌ని గమనించిన కొందరు కేటుగాళ్లు, ఒక న్యాయవాది సహకారంతో ఇక్కడే ఒక క్రిమినల్ మైండ్ గేమ్‌కు తెరలేపారు. కోర్టు ఆదేశాల ప్రకారం రికార్డులు మారిన విషయాన్ని దాచిపెట్టి, 2002లో చనిపోయిన వ్యక్తి 2026లో ఎలా వచ్చి రిజిస్ట్రేషన్ చేశాడు?.. అంటూ సోషల్ మీడియాలో రెవెన్యూ అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కరపత్రాలు సృష్టించారు. ఈ అబద్ధాలతో గండయ్య వారసులను రెచ్చగొట్టి భూమిని అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నించారు. అంతటితో ఆగకుండా, ప్రస్తుతం భూమి స్వాధీనంలో ఉన్న శ్రీనివాసరాజు వర్గాన్ని భయపెడుతూ, సోషల్ మీడియాలో ఇమేజ్ ఖరాబ్ చేస్తామని బెదిరిస్తూ ఏకంగా రూ. 50 లక్షల భారీ వసూళ్లకు తెగబడ్డారు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కటకటాల్లోకి నెట్టారు. ఈ మొత్తం వ్యవహారంపై తహసీల్దార్ గౌతమ్ కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



మేడ్చల్ కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

# ప్రజావాణికి క్యూ కట్టి..గోడు వెళ్లబోసుకుని..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 20, ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ప్రజా సమస్యలు పరిష్కరించటానికి సంబంధిత శాఖల అధికారులు ముందుగా ప్రాధాన్యత ఇవ్వాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో డిఆర్‌ఓ మాలతితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో ప్రజల నుంచి 84 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వీటిలో హౌజింగ్ పిడికి 10 దరఖాస్తులు అత్యధికంగా అందగా, డిఆర్‌డిఎకు 8, ఎస్‌డిసి యుఎల్‌సికి 9, ఈ-సెక్షన్‌కు 9, ఎల్‌పి సెక్షన్‌కు 7, మిగతా శాఖలకు సంబంధించి తక్కువ సంఖ్యలో దరఖాస్తులు అందాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు, అదే విధంగా పలు రాజకీయ పార్టీల నాయకులు కూడ విచ్చేసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందిన అందరి దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సమస్యలను ఎప్పటి కపుడు పరిష్కరించేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ మాలతి, జిల్లా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌నినోపై ముందస్తు చర్యలు ఏవి?

- ✦శాస్త్రవేత్తలు హెచ్చరించినా ప్రభుత్వం స్పందించలేదు
- ✦కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఏమి కోల్పోయారో ప్రజలకు అర్థమవుతోంది
- ✦బిఆర్ఎస్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి
- ✦వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

3లో

# లగ్గానికి సిద్ధమైన బల్కంపేట ఎల్లమ్మ

**నేడు కళ్యాణోత్సవం..అంగరంగ వైభవంగా ఏర్పాట్లు**

**నగరంలో ట్రాఫిక్ మళ్లింపు**

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని ప్రసిద్ధ బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానంలో ఎల్లమ్మ అమ్మవారి జమదగ్ని మహర్షి దివ్య కళ్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మహోత్సవానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు కళ్యాణోత్సవానికి తరలిరానున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం క్యూ లైన్లు, తాగునీరు, అన్నప్రసాదం, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య చర్యలు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నారు. అమ్మవారి దివ్య కళ్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానుండగా, ప్రశాంతంగా ఉత్సవాలు జరిగేలా అధికారులు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టారు. భక్తులు ట్రాఫిక్ సూచనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానంలో జూలై 21, 22 తేదీల్లో జరిగే ఎల్లమ్మ కళ్యాణం, రథోత్సవం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయనున్నట్లు తెలిపారు. గ్రీన్ల్యాండ్స్, మాతా టెంపుల్, సత్యం థియేటర్, ఫతేనగర్, బేగంపేట, ఎస్ఆర్ నగర్ ప్రాంతాల నుంచి బల్కంపేట ఆలయం వైపు వెళ్లే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించనున్నారు. అలాగే ఎస్ ఆర్ నగర్ టీ జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు ఉన్న ఉప రహదారులు, లింక్ రోడ్లను తాత్కాలికంగా మూసివేయనున్నారు. భక్తుల వాహనాల కోసం ఆర్ అండ్ బీ కార్యాలయం, జీహెచ్ఎంసీ గ్రౌండ్, పద్మశ్రీ అపార్ట్మెంట్స్ డీకే రోడ్, ఫతే నగర్ అండర్ బ్రిడ్జి, నేచర్ క్యూర్ హాస్పిటల్, సనత్నగర్ జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్లలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రయాణికులు బల్కంపేట పరిసర ప్రాంతాలను వీలైనంత వరకు నివారించి, ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626ను సంప్రదించాలని కోరారు.







# రూ.11 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు!

**హైదరాబాద్,జులై 20,ప్రభాతవార్త:** మహానగరంలోసొంతింటి కల కంటున్న పేదలకు ప్రభుత్వం అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పింది.. ఇప్పటికే సొంత స్థలం ఉన్నవారికి 5 లక్షల రూపాయలు ఇస్తున్న సర్కార్.. ఇప్పుడు సిటీలో అసలు ఇండ్ల స్థలమే లేని నిరుపేదలకు అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఉచితంగా స్థలంతో పాటు, ఫ్లాట్ నిర్మించి ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఈ ఇందిరమ్మ ఇండ్లు ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి దాదాపు 11 లక్షల రూపాయల ఖర్చవుతుండగా.. ప్రభుత్వం ఇందులో 5 లక్షల రూపాయల భారీ సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది. మిగిలిన 6 లక్షల రూపాయలను లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో తొలిదశలో 7 వేల 680 ఫ్లాట్లు కేటాయించనున్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**తలకొండపల్లి, జూలై 21, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన బండి బిక్షమయ్య అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందాడు. గ్రామస్తుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా రూ.4వేలు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబంలో పెద్దదిక్కును కోల్పోవడంతో బుచ్చింద్ర కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఎప్పుడు అండగాఉంటానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆవంచ నర్సింహారెడ్డి గణేష్ పురుషోత్తం సురేష్ సుదర్శన్ ఆంజనేయులు కిరణ్ తదితరులు ఉన్నారు.




వాటర్ ట్యాంకు శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

## గ్రామస్తులతో వాటర్ ట్యాంక్ క్లీనింగ్ చేసిన సర్పంచ్

**తలకొండపల్లి, జూలై 21 ,ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని వెంకట్రావు పేట గ్రామంలో సోమవారం వారం నాడు గ్రామపంచాయతీకి చెందిన వాటర్ ట్యాంక్‌ను గ్రామస్తులతో కలిసి సర్పంచ్ ఇమ్మడి మహేష్ శుభ్రం చేశారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి గారి సహకారంతో జర్మనీ సాంకేతికత తో ఒరేదు వాటర్ ట్యాంక్ ను క్లీనింగ్ చేయడం జరిగింది. తాగునీటి వాటర్ ట్యాంక్ ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఈ పరిశుభ్రతకు జర్మన్ సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా సర్పంచ్ మహేష్ అన్నారు. ఐక్యత ఫౌండేషన్ సహకారంతో సాంకేతికతతో కూడిన క్లీనింగ్ ను ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలే ప్రశాంత్ గ్రామస్తులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**తలకొండపల్లి ,జూలై 21 ,ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన సంపంగి కృష్ణయ్య ఇటీవల ప్రమాదానికి గురై హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ముక్తాల నరసింహ గౌడ్ సోమవారం నాడు చికిత్స పొందుతున్న వ్యక్తిని గాంధీ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అనంతరం వ్యక్తిగతంగా అతని ఖర్చుల నిమిత్తం ఐదువేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మక్తల నరసింహ గౌడ్, మస్తుదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాం సుందర్ రెడ్డి బాలరాజు వెంకటేష్ తదితరులున్నారు.



వ్యక్తిని పరామర్శిస్తున్న నాయకులు

## నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం

**సర్పంచ్ మోరా సత్యమ్మ, వెంకటేష్**

**కుల్కచర్ల,జూలై 21 ,ప్రభాతవార్త:** గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ మోరా సత్యమ్మ, వెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని కామునిపల్లి గ్రామంలో బిసి కాలనిలోనీటి సమస్య ఉందని సర్పంచ్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించి నూతన మోటర్ ఏర్పాటుచేసి స్థానిక నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మోరా సత్యమ్మ, వెంకటేష్ మాట్లాడుతూ. ..గ్రామ సమస్యలా పరిష్కారానికి నిరం తరం కృషి చేస్తామన్నారు.గ్రామ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిటిసి బాల్‌రెడ్డి,సినియర్ నాయకులు రాఘునాథ్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి ఎల్లమ్మ గ్రామ నాయకులు పాల్గొన్నారు.



నూతన బోరు మోటర్‌ను ప్రారంభిస్తున్న నేతలు


## కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి పరుగులు

**-మారుతున్న గ్రామాల రూపురేఖలు**

**..ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిధులు**

**కొత్తూరు, జూలై 20, ప్రభాతవార్త:**

కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరైన రూ.7 లక్షలతో గ్రామపంచాయతీ నుంచి హనుమాన్ ఆలయం వరకు చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జగన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, పెంజర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రతి గ్రామంలోని ప్రతి వీధికి మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి పెంజర్ల గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మామిడి భారతమ్మ, కటికే మైబూజి, డీలర్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేశాల రమేష్, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి రమేష్, కాంగ్రెస్ నాయకులు మామిడి అర్జున్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఆకనపల్లి సహదేవ్, డి.బుచ్చయ్య, కే.పెంటాజీతో పాటు పలువురు గ్రామస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ జగన్,వార్డు సభ్యులు,తదితరులు

# ప్రభుత్వ ఆసుపత్రి పనులపై సమీక్ష

**ఆమనగల్లు, జూలై20, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని జాతీయ వైద్య విధాన పరిషత్ ఆధీనంలోని ప్రభుత్వ ఆసుపత్రి భవనం పునర్ నిర్మాణం పనులపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తైన పనులు, జరుగుతున్న పనులు, మిగులు పనులపై ఆయన ఆరా తీశారు. నగరంలోని తన నివాసంలో ఈఈ రామ్మోహన్‌రెడ్డి,డీఈ కోటయ్య , వైద్యాధికారి నాగరాజు, హెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి, పీఆర్‌ఓ దేవేందర్ రెడ్డిలతో ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. రూ. 17.50 కోట్ల వ్యయంతో నిర్మాణం జరుపుకుంటున్న ఆసుపత్రి పనులను వీలైనంత తొందరగా పూర్తి చేసి గడువులోపు ప్రభుత్వానికి అప్పగించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అలాగే వైద్య పరికరాలు, లిఫ్టు నిర్మాణం, మార్చురి గది, ఆసుపత్రికి అవసరమైన సిబ్బంది తదితర వివరాల గురించి కూడా ఎమ్మెల్యే ఆరా తీశారు. పనులలో ఎక్కడ రాజీ పడవద్దని, నాణ్యతకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. 50 పడకల సామర్థ్యం కలిగిన ఆమనగల్లు ప్రభుత్వఆసుపత్రి వినియోగంలోకి వస్తే ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసుపత్రి పనుల వివరాలు, వినియోగం గురించి వివరించేందుకు వైద్యాధికారులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అక్కడి నుండి నేరుగా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ్మను కలిసిందుకు వెళ్లారు.



వైద్యాధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

# పోచారంలో రూ. 2 కోట్ల నిధులతో సిసి రోడ్లు

**భూమి పూజ చేసిన కాంగ్రెస్ నాయకులు**

**ఘట్‌కేసర్ రూరల్, జులై 20, ప్రభాత వార్త:** వార్డు 8 పరిధిలోని జోడిమెట్ల నుండి పోచారం వరకు గల రోడ్డును రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసేందుకు సోమవారం కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ ఆధ్వర్యంలో జోడిమెట్ల నుండి పోచారం వరకు గల రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల రూపాయల నిధులు ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడితో పాటు మాజీ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ డివిజన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు ఏర్ర రాజు, బద్దం శ్రీనివాస్ రెడ్డి, బిఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోచారం డివిజన్‌లో రెండు కోట్ల రూపాయల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ తదితరులు.

# చెత్త కాదు.. సంపదగా మార్చుకుందాం!



మొక్కలు నాటుతున్న ఎంపిడివో అరుంధతి,సర్పంచ్ నరసింహ రెడ్డి,తదితరులు

**-ఇంకుడు గుంతలు భవిష్యత్ తరాలకు భరోసా**

**: ఎంపీడీవో సిహెచ్ అరుంధతి..**

**- పొడి చెత్తను వేరు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**: సర్పంచ్ నరసింహారెడ్డి**

**కొత్తూరు, జులై 20, ప్రభాత వార్త:**

భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కొత్తూరు ఎంపీడీవో సిహెచ్ అరుంధతి సూచించారు. సోమవారం కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామంలో సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు, వ్యర్థాల నుంచి సేంద్రీయ ఎరువుల తయారీ కోసం ఏర్పాటు చేసిన కంపోస్టు యార్డును ఎంపీడీవో అరుంధతి, సర్పంచ్ నరసింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించేందుకు ఇంకుడు గుంతలు ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు.

పొడి చెత్తలోని ప్లాస్టిక్, డబ్బాలు, అట్టముక్కలు తదితరాలను డీఆర్‌సీసీకి తరలించాలని, తడి చెత్తను వర్మీకంపోస్టు పిట్స్ ద్వారా సేంద్రీయ ఎరువుగా మార్చాలని తెలిపారు.

గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టి, వంద శాతం చెత్త సేకరణ, వేర్పాటు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి కుటుంబం చెత్తను ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందిస్తే గ్రామాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సుహాసిని, ఎంపీఓ కృష్ణకాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ స్వరూప, పంచాయతీ కార్యదర్శి విక్రం రెడ్డి, వార్డు సభ్యులు పవిత్ర జయేందర్ రెడ్డి, స్వాతి రాజేష్, సురేందర్ రెడ్డి, వరుణ్ గౌడ్, చిర్ర ప్రశాంత్, సంతోష్‌తో పాటు నాయకులు పాపిరెడ్డి, పెంటారెడ్డి, దామోదర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, విట్టల్ రెడ్డి, కమల్ రెడ్డి, చిర్ర సుదర్శన్, చిర్ర యాదయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలేవి?

**రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే: డాక్టర్ మెతుకు ఆనంద్**

**కోట్ పల్లి,20, ప్రభాత వార్త:**

వికారాబాద్ నియోజకవర్గం కోట్ పల్లి మండలంలోని బీరోల్ మరియు జిన్నారం గ్రామాలలో సోమవారం నాడు అయన వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పర్యటించారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం వివరాలను తెలుసుకొని, అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “రాబోయేది కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఏమి కోల్పోయారో ఇప్పుడు అర్థమవుతుందన్నారు గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను సక్రమంగా అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. రైతులను పూర్తిగా విస్మరించిందని ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు రైతులకు రైతుబంధు నిధులను కూడా పలుమార్లు ఆలస్యం చేసి, కొద్దిమందికే విడుదల చేసి చేతులు దులుపుకుందన్నారు ప్రజలందరూ ఇవన్నీ గమనిస్తున్నారు అని అన్నారు.త్వరలో భారత రాష్ట్ర సమితి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానుందని, ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పీఎస్ఏ చైర్మన్ రామచంద్ర రెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు సుందరి అనిల్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, జిన్నారం సర్పంచ్ హుస్సేన్, బీరోల్ సర్పంచ్ మోముల సుధాకర్, సర్పంచ్ రవి, కరీంపూర్ సర్పంచ్ సదత్, ఉపసర్పంచులు అనిల్, మహబూబ్, మైసయ్య, నర్సింలు, సురేష్ నాయక్, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, నాయకులు నర్సింలు, అరుణ్, జయ్‌కుమార్, ఆనందం, యాకూబ్, ప్రభాకర్, దశరత్, గౌరీశంకర్, ప్రభాకర్ రెడ్డి, సర్దార్, మైపాల్ రెడ్డి, శ్రీనివాస్, మొగులయ్య, దేవదాస్, ఖాజా, లక్ష్మణ్, గోవర్ధన్ రెడ్డి, బిచ్చయ్య, అబ్బు, ఫైజొద్దీన్, బంధయ్య, పురుషోత్తం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు దేవాలయాలు

**కేశంపేట, జులై 20, ప్రభాతవార్త :**

ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు దేవాలయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ బీసా కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు.కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామ ప్రభుత్వ పాఠశాల సుందరీకరణ కోసం సోమవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బీసా కరుణాకర్ రెడ్డి 10 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పవన కుమారికి అందించారు.ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రంగయ్య, మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, వార్డు సభ్యుడు పోగుల నర్సింలు, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిట్టిరెడ్డి వెంకట్ రెడ్డి, గుత్తి శేఖర్, పాండురంగారెడ్డి, నారంజి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విచారణ జరిపించాలి

**- డిఇ ఇరిగేషన్ అధికారికి పోచారం జగన్ రెడ్డి వినతి**

**- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయంటూ ఫిర్యాదు**

**కేశంపేట, జులై 20, ప్రభాతవార్త :**

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై సమగ్ర విచారణ నిర్వహించి, తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన పోచారం జగన్ రెడ్డి సోమవారం ఇరిగేషన్ డి ఈ అధికారికి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, కొత్తపేట గ్రామ శివారులోని సర్వే నంబర్-16 పరిధిలోని కోన చెరువులో 3,500 మెట్రిక్ టన్నుల గ్రావెల్ తవ్వకాలకు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్, తెలంగాణ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.ఈ తవ్వకాల వల్ల భూగర్భ జలాల నీటి మట్టం తగ్గిపోవడంతో పాటు పరిసర ప్రాంత రైతులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పర్యావరణ సమతుల్యతకు కూడా ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయని వినతిపత్రంలో పేర్కొన్నారు.సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లు తేలితే వెంటనే వాటిని నిలిపివేసి తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోచారం జగన్ రెడ్డి కోరారు.ఈ ఫిర్యాదుపై సంబంధిత అధికారులు త్వరితగతిన స్పందించి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కూడా ఫుడ్ అంత స్థాయి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**కేశంపేట సిఐ నరహరి**

**కేశంపేట, జులై 20, ప్రభాతవార్త :**

అక్రమంగా తరలిస్తున్న పిడిఎఫ్ బియ్యాన్ని పట్టుకుని బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి 14 టన్నుల బియ్యాన్ని, తరలించేందుకు వాడిన బొల్లేరో వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని వేముల నర్వ గ్రామంలో పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం పిడిఎస్ బిఆర్ ని అక్రమంగా తరలిస్తున్నరన్న విశ్వాసనీయ సమాచారం మేరకు కేశంపేట పోలీస్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా టీఎస్ 07 గేబీ 4326 నెంబర్ గల బొలెరో వాహనంలో అక్రమంగా పిడిఎఫ్ బియ్యన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద పిడిఎఫ్ బియ్యాన్ని రవాణాకు సంబంధించిన ఎలాంటి చట్టపరమైన అనుమతులు లేకపోవడంతో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన నిత్యవసర వస్తువులను అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చట్టరీత్యా చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ నరహరి హెచ్చరించారు . ఎవరైనా ఇలాంటి అక్రమ కార్యక్రమాలకు పాల్పడితే ప్రజలు వెంటనే పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని తెలిపారు.



ఉప్పల్ జోన్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ కుమార్.

## పోచారం డివిజన్‌లో వీధి లైట్లు ఏర్పాటు చేయండి

**ఘట్‌కేసర్ రూరల్, జులై 20, ప్రభాత వార్త:** పోచారం డివిజన్‌లో వీధి దీపాలు, హైమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఉప్పల్ జోన్ కమిషనర్ రాధికను కలిసి వినతి పత్రం అందజేసినట్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కే. వినోద్ కుమార్ తెలిపారు. త్వరలో జరుగబోయే బోనాల ఉత్సవాల సందర్భంగా వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. రాత్రి వేళల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా భద్రత దృష్ట్యా వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, పాడైపోయిన వాటిని మరమ్మత్తు చేసి వెలుతురు వచ్చేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఉప్పల్ జోన్ కార్యలయంలో వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అందజేసిన వినతిని స్వీకరించి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



అనురాగ్ యూనివర్శిటీలో యూత్ ఎంపవర్‌మెంటుపై ఒకరోజు పాటు నిర్వహించిన వర్క్‌షాపుకు హాజరైన వక్తలు, విద్యార్థులు.

## యూత్ ఎంపవర్‌మెంట్‌పై వర్క్‌షాపు విజయవంతం

**ఘట్‌కేసర్ రూరల్, జులై 20, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో ఐఈఈఈ ఎస్ఎస్ఐటీ చాప్టర్, ఇన్ఫరేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన టాస్క్ సీనర్జీ కార్యక్రమంలో భాగంగా యూత్ ఎంపవర్‌మెంట్ అంశంపై ఒకరోజుపాటు నిర్వహించిన వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసిందని ప్రోగ్రామ్‌కో ఆరినేటర్ జి. శేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, ఉపాధి నైపుణ్యాలు వృత్తి అవకాశాలు, సామాజిక బాధ్యతపై విలువైన సూచనలు అందించినట్లు తెలిపారు. వర్క్‌షాపు ముగింపు సందర్భంగా పలువురు వక్తలకు మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టాన్లీ డి క్రూజ్, సారి సన్వా, జి. ఎల్. ఆనంద్‌బాబు, ఫ్యాకల్టీ సలహాదారుడు నితీషా శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అతి వేగం బలి...

**బోల్తా పడిన కారులో యువ విద్యార్థి వరుణ్ మృతి**

**జవహర్‌నగర్, జులై 20, ప్రభాత వార్త:** జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అతి వేగంగా కారు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువ విద్యార్థి మృతి చెందిన విషాద ఘటన వెలుగులోకి వచ్చింది.శ్రీ నలిన్ మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆయన కుమారుడు శ్రీ వెల్లంగులం వరుణ్ (22), విద్యార్థి, తన స్నేహితులను కలిసేందుకు ఈ నెల 19వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో సైనిక్‌పురికి వెళ్లాడు. అనంతరం 20వ తేదీ తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో టీఎస్37డీ1736 నంబర్ గల వెంటో కారులో ఇంటికి తిరిగి వస్తుండగా, యాప్రాల లోని ఓం శ్రీ సిగ్నెట్ అపార్ట్‌మెంట్స్ సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. అతి వేగంగా వాహనం నడపడం వల్ల కారు అదుపుతప్పి రోడ్డుకు పక్కన ఉన్న ఇంటి ముందు వాలును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వరుణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న అలి, అరుణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.ప్రమాదం అనంతరం వరుణ్‌ను అతని స్నేహితులు మరో కారులో చికిత్స నిమిత్తం మిలిటరీ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## హనుమాన్ దేవాలయములో ప్రత్యేక పూజలు

**ఆమనగల్లు, జులై 20, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో సోమవారం మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్య నాయక్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా ఆశించిన వర్షాలు కురవకపోవడంతో వరుణ దేవుడి పూజలు నిర్వహించాలని ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి రాజకీయ పార్టీ నాయకులు రైతులు ఇతర వర్గాల ప్రజలు హాజరయ్యారు. వరుణ దేవుడి నీ ప్రార్థిస్తూ ఈనెల 23న పట్టణంలో వరద పాశం నిర్వహించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. చేపట్టే ప్రత్యేక కార్యక్రమంలో రైతులు గ్రామ పెద్దలు, యువకులు , వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మొక్కల వెంకటయ్య, నాగిళ్ల జగన్, మల్యా నాయక్, కో ఆప్షన్ నెంబర్ చుక్క అల్లాజీ గౌడ్ , గ్రామ పెద్దలు గుర్రం కేశవులు, వసుప్పుల జంగయ్య, వసుప్పుల మానయ్య,గంగిశెట్టిమల్లయ్య, కాలే మల్లయ్య, దూసకంటి యాదయ్య,పులికంటి మైసయ్య, రాగ్యా, చంద్రయ్య, జంతుక శంకర్, రేవల్లి రాజు, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నేనావత్ పత్య నాయక్

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

-దౌల్తాబాద్ ఎస్ఐ వేణుకుమార్

**దౌల్తాబాద్, జులై 20, ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని దౌల్తాబాద్ ఎస్ఐ వేణుకుమార్ హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఆయన సూచించారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై నిఘా ఉంచామని తెలిపారు. రోడ్డు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో కఠినమైన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్ఐ కోరారు.

## దుకాణాల తనిఖీ...



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

**శంకర్‌పల్లి, జులై 20, ప్రభాతవార్త :** శంకర్ పల్లి మండలంలోని పిల్లిగుండ్ల, పొద్దుటూరు గ్రామాల్లోని దుకాణాలను ఈగల్ టీంతోపాటు ఎస్ఐ పద్మ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కిరాణ దుకాణాల్లో అక్రమంగా మద్యం మత్తు పదార్థాలు ఏమైనా విక్రయిస్తున్నారా అన్న అనుమానంతో తనిఖీలు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పిలిగుండ్ల గ్రామ చౌరస్తాలో చైన్స్ స్నాచింగ్ చిల్డ్రన్స్ సేఫ్టీ సైబర్ క్రైమ్ రోడ్ సేఫ్టీ పైన అవగాహన కల్పించారు.

## మేడ్చల్ రూరల్ జిల్లా బిజెవైఎం అధ్యక్షుడిగా రాగం అర్జున్



అర్జున్‌ను సన్మానిస్తున్న మేడ్చల్ బీజేపీ నాయకులు

**మేడ్చల్, జులై 20. ప్రభాతవార్త :** భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడిగా మేడ్చల్‌కు చెందిన రాగం అర్జున్ ఎన్నికయ్యాడు. ఆయనకు అధ్యక్షుడుగా నియమిస్తూ సోమవారం బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుందే గణేష్ నియామకపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా రాగం అర్జున్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన బిజెపి రాష్ట్ర నాయకత్వానికి, బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుందే గణేష్‌కు, మేడ్చల్ రూరల్ జిల్లా మాజీ బిజెపి అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ యువతను సంఘటితం చేసి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ బలోపేతంతో పాటు యువత సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు సాగుతానని చెప్పాడు. ఈ సందర్భంగా అర్జున్‌ను మేడ్చల్‌లో స్థానిక బిజెపి నాయకులు సన్మానించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్, జిల్లా కోశాధికారి లవంగ్ శ్రీకాంత్, మేడ్చల్ మున్సిపల్ బిజెపి ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెవైఎం కార్యదర్శి కానుకంటి భరత్ వంజరి, నాయకులు జకట బాబు రాజు, అర్జున్, గౌలికర్ మహేష్, డి. సాయి, పికెట్ మల్లికార్జున్, పురుషోత్తం, బాలకృష్ణ, క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ డివిజన్‌లో ఎస్ఐఆర్‌పై బిజెపి నాయకుల అవగాహన



మేడ్చల్‌లో ఎస్ఐఆర్ పత్రాలను అందజేస్తున్న బీజేపీ నేతలు

**మేడ్చల్, జులై 20, ప్రభాతవార్త :** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 57, 58, 59 వ బూత్‌లలో బీఎల్‌వో ఆధ్వర్యంలో ఎన్యుమరేషన్ పత్రాలను బిజెపి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా కోశాధికారి లవంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ సమయాన్ని వెచ్చించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నాడు. ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకొని నింపి వాటిని తిరిగి బిఎల్ఓకు అందచేసి తమ ఓటు హక్కును పొందాలని కోరాడు. ఈ కార్యక్రమలో బిజెవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్, నాయకులు ప్రవీణ్, వాణి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## గౌరారం గ్రామంలో 100 వీధిలైట్ల ఏర్పాటు

**దుద్యాల్, జులై 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గౌరారం గ్రామాన్ని మరింత వెలుగులతో నింపే లక్ష్యంతో గ్రామ సర్పంచ్ కిషబాయి రాథోడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని వివిధ వీధుల్లో 100 కొత్త ఎల్ఇడి వీధిలైట్లను ఏర్పాటు చేశారు. వీధి లైట్ల ఏర్పాటు ద్వారా గ్రామ ప్రజలకు రాత్రి వేళల్లో మెరుగైన వెలుతురు, భద్రత, సౌకర్యం కల్పించారు. గ్రామ ప్రజలు, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్, గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఖాజా మైనుద్దీన్, గ్రామ లైన్‌మన్ వెంకటయ్య, గ్రామ తపాలా శాఖ బీపీఎం వెంకటయ్య గౌడ్, నాయకులు అంతు నాయక్, జూనియర్ లైన్‌మన్ అశోక్, గ్రామపంచాయతీ సిబ్బంది చీమల కృష్ణ, ఎర్రోళ్ల రవి, బుల్కాపురం వెంకటయ్య, పెయింటింగ్ కాంట్రాక్టర్ కృష్ణ పాల్గొన్నారు.



వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

## చేవెళ్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా శ్రీనివాస్‌గౌడ్ ఎంపిక

**చేవెళ్ల, జులై 20, ప్రభాతవార్త :** చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలు, మూడు మున్సిపాలిటీలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవార ఉత్తర్వులు జారీ చేశారు. చేవెళ్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడుగా శ్రీనివాస్‌గౌడ్‌ను చేవెళ్ల మండల అధ్యక్షునిగా రేగడి ఘనపూర్ గ్రామానికి చెందిన గిరిధర్ రెడ్డిని ఎంపిక చేశారు. నూతనంగా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షునిగా పలుగుట్ట గ్రామానికి చేందిన శ్రీనివాస్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది. చేవెళ్ళ మండల పార్టీ అద్యక్షుడుగా రేఘడిఘనాపూర్ గ్రామానికి చేందిన గిరిధర్‌రెడ్డిని ఎన్నిక చేశారు. చేవెళ్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా శ్రీనివాస్‌గౌడ్, చేవెళ్ల మండల పార్టీ అధ్యక్షుడుగా గిరిధర్ ఎంపిక చేసినందుకు చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

# మేడ్చల్‌లోని రోడ్డులో వరి నాటువేసి నిరసన వ్యక్తం చేసిన బిఆర్ఎస్



మేడ్చల్ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వరి నాటు వేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**మేడ్చల్, జులై 20, ప్రభాతవార్త :** మేడ్చల్‌లో ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. మేడ్చల్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు నుండి రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పడ్డ గుంతల్లో బీఆర్ఎస్ నాయకులు వరి నాటు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ మేడ్చల్ మున్సిపాలిటీని రూ. 30 లక్షల నిధులతో జీహెచ్ఎంసీలో కలుపగా కనీసం మూడు రూపాయల పని చేయలేదని ఆరోపించాడు. బ్లీచింగ్ వేయడం లేదని, లైట్లు వెలుగవని, పారిశుధ్యం లోపించి రోగాల బారిన పడి రోగాల పాలై ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించలేని ఈ ప్రభుత్వం గుడ్డి ప్రభుత్వమని, అధికారుల్లో చలనం లేకుండా పోయిందని ఎద్దేవా చేశాడు. మేడ్చల్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీ నుండి రైల్వే స్టేషన్ వరకు గల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి చినుకులకే చిత్తడిగా మారి గుంతల్లో నీరు నిలిచిందని, పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ గుంతల్లో చిన్నారుల పడి గాయాలపాలవుతున్న అధికారులకు కనపడటం లేదని ఆరోపించాడు. ఈ రోడ్డులో ప్రతినిత్యం కార్యాలయాలకు, పాఠశాలలకు, వివిధ గ్రామాలకు వేలాది మంది వెలుతుంటారని కాని రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దయానంద్ యాదవ్, నవీన్‌రెడ్డి, విష్ణుచారీ, పాండు గుప్త, నాగరాజు, సందీప్ గౌడ్, ప్రతాప్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

-చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సూచన

**చేవెళ్ల, జులై 20, ప్రభాతవార్త :** చేవెళ్లలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అధికారులకు సూచించారు.

చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో అంబేద్కర్ నగర్ కాలనీలో అనేక సంవత్సరాలుగా ఇండ్ల మధ్యలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే కాలే యాదయ్య దృష్టికి చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి తీసుకువెళ్లారు. దీంతో సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని సూచించారు. అధికారులు స్పందించి టాన్స్‌ఫార్మన్‌ను తొలగించి ఇతర ప్రాంతంలో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 19 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశామన్నారు. 10 ట్రాన్స్‌ఫార్మర్లను బిగించామని, 9 ట్రాన్స్‌ఫార్మర్ల పనులను కూడా అత్యంత త్వరలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. "ప్రజల సమస్యల పరిష్కారమే నా మొదటి ప్రాధాన్యత. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు లేకుండా ప్రతి వార్డులో అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజల భద్రత, సౌకర్యాల కోసం ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, చేవెళ్ల మున్సిపల్ కౌన్సిలర్లు బండారి శైలజ ఆగిరెడ్డి, శ్రీనివాస్, మంగలి కళ్యాణి యాదగిరి, కృష్ణా నాయక్, మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, మాజీ వార్డు సభ్యులు మల్గారి మల్లారెడ్డి, జంగన్నోళ్ల హరికృష్ణ, చాకలి శ్రీనివాస్, నాయకులు మధ్యల చింటూ, అత్తిలి రవీందర్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పొట్ట దయాకర్, సుశాంత్, లియాకత్, వడ్ల శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు .



చేవెళ్లలో ఇండ్ల మధ్యలో గల ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ఇంతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంబించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

# రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి : బిఆర్ఎస్ నాయకుల డిమాండ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**దుద్యాల్, జులై 20, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో గతంలో భూ సేకరణను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టిన రైతులపై నమోదు చేసిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం దుద్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, అభివృద్ధి పేరుతో రైతులపై కేసులు నమోదు చేసి జైలుపాలు చేయడం బాధాకరమని అన్నారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు సేకరించే సమయంలో రైతులు తమ హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు వ్యక్తం చేశారని, అయితే అప్పటి పరిస్థితుల్లో 72 మంది రైతులపై కేసులు నమోదు చేయడం అన్యాయమని ఆరోపించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాకు వస్తున్న సందర్భంగా రైతుల సమస్యలపై స్పందించి, కేసుల ఎత్తివేతపై స్పష్టమైన ప్రకటన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే చర్యలకు బదులుగా వారి సంక్షేమం, భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ, రైతుల హక్కులను కాలరాస్తూ ముందుకు సాగడం సరికాదన్నారు. రైతుల మనోభావాలను గౌరవించి, వారి ఆందోళనలకు గౌరవం ఇవ్వాలని కోరారు. లేకపోతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, పుర్ర నారాయణ, బుగ్గప్ప, దొరమోని సాయిలు, శివకుమార్, బసప్ప, విశాల్, యాదయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి

..వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలి

..మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 20, ప్రభాతవార్త:** ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ ఆదేశించారు. సోమవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మల్లాపూర్ యుపిహెచ్‌సి ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంకు సంబంధించి రికార్డులను ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య కిట్ల పంపిణీ, వాటి పనితీరను పరిశీలించారు. అర్హులైన లబ్దిదారులకు సకాలంలో కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షయవ్యాధి టిబి నియంత్రణ కార్యక్రమంపై సమీక్షించారు. నమోదైన క్షయవ్యాధి రోగులకు డైరక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయంకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియలను ధృవీకరించారు. రోగుల వివరాలు సకాలంలో నమోదు చేసి డిబిటి ప్రయోజనాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఆరోగ్యకేంద్రంకు సంబంధించి పలు అంశాలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లాలోని మల్లాపూర్ ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేసిన మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్, పాల్గొన్న తదితరుల దృశ్యం

# పిఆర్‌సిని అమలు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం



చేవెళ్ల బాలికల పాఠశాలలో సభ్యత్వం చేస్తున్న పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి

**చేవెళ్ల, జులై 20, ప్రభాతవార్త :** పిఆర్‌సి ని అమలు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం పిఆర్‌టియుటిఎస్ సభ్యత్వంలో భాగంగా చేవెళ్ల మండలం జెడ్పిహెచ్ఎస్ బాలికల, జడ్పిహెచ్ఎస్ మల్కాపూర్, చేవెళ్ల జెడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాలలను సందర్శించారు. ఈ ఈ సందర్భంగా పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో తేదీ లోపు రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సి అమలు చేసి, పెండింగ్ డిఎలను మంజూరు చేయకపోతే ఉద్యమ బాట తప్పదన్నారు. హెల్త్ కార్డులను వెంటనే అమల్లోనికి తీసుకురావాలని అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్‌లో పనిచేసే విధంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి హైకోర్టు ఉత్తర్వుల మేరకు 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి మేనిఫెస్టోలో సిపిఎస్ రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ అమలు చేస్తామని చెప్పి దాదాపు మూడు సంవత్సరాలు గడిచిన అమలు చేయకపోవడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులలో అసహనం పెరిగిపోతున్నదని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే సిపిఎస్‌ను రద్దుచేసి అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను కలుగ జేయాలన్నారు. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రాతినిధ్యం మేరకు త్వరలో ఇన్ సర్వీస్ టెట్ నిర్వహించబోతున్నారు. ఉపాధ్యాయులు సంసిద్ధులు కావాలని కోరారు రేష్నలై జేషన్ జీవో 25 ను సవరించి త్వరలో రేషనలైజేషన్ మరియు బదిలీలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల శాఖ అధ్యక్షులు దయానందం, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర బాధ్యులు అంజయ్య, జిల్లా బాధ్యులు వెంకటయ్య, బుచ్చిబాబు, మండల కార్యదర్శి శివకుమార్, కుమార్, కరుణాకర్ రెడ్డి, వెంకటయ్య, వెంకటేశం, బాలాజీ, పిఆర్‌టియుటిఎస్ ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు .

# లాల్‌గడిమలక్‌పేట్‌కు ప్రత్యేకంగా ఆర్టీసి బస్‌ను ఏర్పాటు చేయాలి

..గ్రామ అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న రిక్వెస్ట్ బస్‌స్టాప్ వద్ద ఆర్టీసి బస్సులు ఆపక ఇబ్బందులు-ఆపాలని కోరిన వైనం

..అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ కైర గణేశ్

..హకీంపేట్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం

**శామీర్‌పేట, జులై 20, ప్రభాతవార్త:** లాల్‌గడిమలక్‌పేట్ గ్రామానికి నగరం నుంచి ప్రత్యేకంగా ఆర్టీసి బస్సును ఏర్పాటు చేయాలని, అదే విధంగా గ్రామంలోని అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న రిక్వెస్ట్ బస్‌స్టాప్ వద్ద ఆర్టీసి బస్సులు ఆపటం లేదని, ఆపటానికి తగు చర్యలు తీసుకోవాలని హకీంపేట్ ఆర్టీసి డిపో మేనేజర్ సరితాదేవికి అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ కైర గణేశ్ వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్‌కు విద్యార్థుల, ఉద్యోగుల, వ్యాపారస్తుల, ప్రయాణీకుల సౌకర్యం కోసం నగరానికి (సికింద్రాబాద్) వెళ్లటానికి లాల్‌గడిమలక్‌పేట్‌కు ప్రత్యేకబస్సును నడపాలని మంజూరు చేయాలని కోరటం జరిగిందని కౌన్సిలర్ కైర గణేశ్ తెలిపారు. అదే విధంగా లాల్‌గడిమలక్‌పేట్‌లోని అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న ఆర్టీసి రిక్వెస్ట్ బస్సు స్టాప్ వద్ద ఆర్టీసి బస్సులు ఆపటం లేదని, బస్సులను ఆపటానికి తగు చర్యలు తీసుకోవాలని డిఎంను కోరినట్లు కౌన్సిలర్ కైర గణేశ్ తెలిపారు. దీనికి డిఎం స్పందిస్తూ గ్రామంలోని అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న ఆర్టీసి రిక్వెస్ట్ బస్‌స్టాప్ వద్ద బస్సులను ఆపటానికి తగు చర్యలు తీసుకుంటామని డిపోమేనేజర్ సరితాదేవి హామీ ఇచ్చినట్లు సానుకూలంగ స్పందించారని, అదే విధంగా లాల్‌గడిమలక్‌పేట్‌కు ఆర్టీసి ప్రత్యేక బస్సు ఏర్పాటుకు పరిశీలిస్తామని తెలిపినట్లు ఆయన తెలిపారు.




హకీంపేట్ ఆర్టీసి డిపో మేనేజర్ సరితాదేవికి లాల్‌గడిమలక్‌పేట్‌లో ఆర్టీసి బస్సుల సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేసిన అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ కైర గణేశ్ దృశ్యం

## పదవికి వన్నె తెస్తా..

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం..

**కొత్తూరు, జులై 20, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంబటి ప్రభాకర్‌కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్ బి పల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి నాయకత్వంలో గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు అంబటి ప్రభాకర్ తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ పదవి అలంకరణ కోసం కాదని, ప్రజలకు, పార్టీకి సేవ చేసే బాధ్యతగా భావిస్తున్నానని అంబటి ప్రభాకర్ స్పష్టం చేశారు. తనకు అప్పగించిన పదవికి వన్నె తెచ్చేలా, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఆయనకు జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి దక్కడంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



## గడ్డివాముకు నిప్పు అంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

-కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపిన సిఐ నరహరి

**కేశంపేట, జులై 20, ప్రభాతవార్త :** గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు అంటించిన ఘటన సోమవారం కేశంపేట మండల పరిధిలోని లింగందన గ్రామంలో చోటుచేసుకుంది. సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం లింగంధన గ్రామానికి చెందిన నాగిళ్ల నర్సింహ, ఆదివారం సాయంత్రం తనకు చెందిన పశువులకు మేత వేసి ఇంటికి వెళ్లిన భోజనం చేసి పడుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున సుమారు 4:30 గంటలకు తన గడ్డివాములకు మంటలు అంటుకున్నాయని తెలిసిన వ్యక్తులద్వారా సమాచారం అందడంతో వెంటనే పొలానికి వెళ్లి చూడగా, సుమారు 100 గడ్డి కట్టలు ఉన్న రెండు గడ్డివాములు పూర్తిగా కాలిపోయినట్లు గుర్తించారు. అలాగే, పక్కనే ఉన్న రైతు నాగిళ్ల కృష్ణయ్యకు చెందిన సుమారు 50 గడ్డికట్టలు కూడా మంటల్లో కాలిపోయినట్లు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా గడ్డివాములకు నిప్పంటించి ఈ నష్టం కలిగించినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడని సిఐ నరహరి తెలిపారు. ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

పోటో రైటప్

## ఎస్ఐఆర్ ఫాంను తప్పని సరిగా నింపాలి

-మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి

**చేవెళ్ల, జులై 20, ప్రభాతవార్త :** ఓటర్లందరు ఎస్ఐఆర్ ఫాంను తప్పని సరిగా నింపాలని, ఎస్ఐఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సూచించారు. సోమవారం చేవెళ్ల మండలం కౌకుంట్లలో ఎన్యుమరేషన్ ఫారాలు సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డిలు నింపి సంబందిత బిఎల్ఓలకు అందజేశారు. చేవెళ్ల మండల కౌకుంట్లలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి తన ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపి బీఎల్‌వోకు అందజేశారు. రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి కూడా తన ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపి బీఎల్‌వోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ పట్లోళ్ల క్రిష్ణారెడ్డి, కౌకుంట్ల సర్పంచ్ మల్లారెడ్డి, అంతరం మాజీ సర్పంచ్ అంజయ్య తదితరులు పాల్గోన్నారు.



ఎన్యుమరేషన్ ఫారాన్ని బీఎల్‌వోకు అందజేసిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి

## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి..

**దుద్యాల్, జులై 20, ప్రభాతవార్త:** దుద్యాల్ మండలంలోని వాల్య నాయక్ తండా గ్రామ పంచాయతీకి చెందిన తులసిరావు-లక్ష్మీబాయి దంపతుల పాడి గేదె విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని బాధితులు ఆరోపించారు. అప్పు చేసి గేదెను కొనుగోలు చేసి, పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నామని, గేదె మృతితో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## నాటిన ప్రతి మొక్కను బతికించాలి

**జిల్లెడు చౌదరిగూడ, జులై 20, (ప్రభాతవార్త):** గ్రామంలో నాటిన ప్రతి మొక్కను బతికించాలని టెక్నికల్ అసిస్టెంట్ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని వీరన్నపేట గ్రామంలో మొక్కలు నాటె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సుమలత గ్రామంలో మొక్కలు నాటారు. గ్రామంలో నాటిన ప్రతి మొక్కరు కాపాడాలని టెక్నికల్ అసిస్టెంట్ సూచించారు. ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సర్పంచ్, టెక్నికల్ అసిస్టెంట్ వినోద్‌కుమార్